WWW.NETIDARSHINI.COM
PRGI NO:APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com
సోమవారం 17-08-2026

# నందికొట్కూరులో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పూజలు

-పుట్టల వద్ద పోటెత్తిన భక్తులు..
-ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు




**నందికొట్కూరు ఆగస్టు 16(నేటి దర్శిని):**
శ్రావణ మాసంలో వచ్చే పవిత్రమైన నాగుల పంచమి పండుగను పురస్కరించుకుని నందికొట్కూరు పట్టణం భక్తిశ్రద్ధలతో పులకించింది. శనివారం పట్టణంలోని విద్యానగర్ నాగుల కట్ట, కాలేజీ రోడ్డులోని సుప్రసిద్ధ పుట్టల వద్ద ఉదయం నుంచే మహిళలు, భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుట్టలకు పసుపు, కుంకుమ సమర్పించి పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చలిమిడి, వడపప్పు, అరటిపండ్లు, పాలు, గుడ్లు నైవేద్యంగా సమర్పించారు. తమ పిల్లలకు, కుటుంబ సభ్యులకు నాగదోషాలు తొలగిపోయి సుఖశాంతులు కలగాలని వేడుకున్నారు.యువతులు, చిన్నారులు సైతం పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు, స్థానిక పెద్దలు ముందస్తుగా ఏర్పాట్లు చేశారు. పుట్టల పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు భక్తులు క్యూలైన్లలో వెళ్లేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. తాగునీటి వసతితో పాటు ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఉన్నప్పటికీ భక్తులు ఓపికగా వేచి ఉండి మొక్కులు తీర్చుకున్నారు.నాగుల పంచమి సందర్భంగా విద్యానగర్ నాగుల కట్ట వద్ద మహిళలు, చిన్నారులు పుట్టకు పాలు పోసి పూజలు చేశారు. సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ నాగుల పంచమి రోజు పుట్టకు పూజలు చేస్తే సంతానం కలుగుతుందని, ఇంట్లో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని తమ పెద్దలు చెప్పారని తెలిపారు. ప్రతి ఏటా నాగుల పంచమి సందర్భంగా ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటామని చెప్పారు.

## 1315 వ రోజుకు చేరుకున్న లయన్ కె లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత భోజన పథకం



**తాళ్లరేవు, ఆగస్టు 16(నేటి దర్శిని):**
కాకినాడ జిల్లా తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న లయన్ కె లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత భోజన పథకం ప్రారంభించి,ఆదివారం నాటికి 1315 వ రోజుకు చేరుకుంది. కెనడాకు చెందిన బిళ్ళకుర్తి నిర్విలాశ్రీత పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు లయన్ జయ వివేక్ రెడ్డి,లయన్ సత్యపావని,తాతయ్యలు , నానమ్మ ,అమ్మమ్మ లయన్ శ్రీనివాసరెడ్డి, లయన్ విజయ లావణ్య, టి శేషారెడ్డి, రాణిచే నిరుపేదలకు భోజనములు,బిస్కెట్ ప్యాకెట్స్ ,స్వీట్ సేమియా ఏర్పాటు చేశారు.వీరికి ఆ అభాగ్యుల ఆశీస్సులు , వీరి సేవా దృక్పథానికి, లాశ్రిత పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేక శుభాభినందనలు ,శుభాశీస్సులు తెలియజేశారు.

## ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు చిరుమర్తి



**రామన్నపేట ఆగస్టు 16(నేటి దర్శిని):**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో నిర్వహించిన శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమం సందర్భంగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం దాతల సహకారంతో నిర్మించిన నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పాల్గొన్నవారు, ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్, సీనియర్ నాయకులు మందడి విద్యాసాగర్ రెడ్డి, ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మంటి లింగస్వామి, చిన్న పాక శ్రీనివాస్, బందెల రాములు, బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, బద్దులరమేష్ యాదవ్, పోషబోయిన మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం సమరశంఖం

-అణచివేతపై అక్షర పోరాటం..
హక్కుల కోసం ఒక్కటైన కలం




**కర్నూలు, ఆగస్టు 16(నేటి దర్శిని):**
జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. పత్తికొండ నియోజకవర్గ ఏపీఎంఎఫ్ కమిటీ నిర్మాణ మహాసభ కర్నూలు జిల్లా కన్వీనర్ ఎం. సాయి కుమార్ నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నూతన కమిటీని ప్రకటించారు. ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. మద్దిలేటి, జిల్లా కన్వీనర్ ఎం. సాయి కుమార్ నాయుడు, జిల్లా కో-కన్వీనర్లు ఆర్. బాలకృష్ణ, కె. రంగనాథ్, బి. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పత్తికొండ నియోజకవర్గ ఏపీఎంఎఫ్ అధ్యక్షుడిగా మద్దికేర శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా సి. సురేష్, కార్యదర్శిగా వీవీ నాయుడు, కోశాధికారిగా విష్ణువర్ధన్ గౌడ్‌ను నియమించారు. మండల ఉపాధ్యక్షులుగా బి. రంగన్న, రాం ప్రతాప్ గౌడ్, సి. రాము, పి. రాజు, మహేష్, వి. నాగార్జున, రామాంజనేయులను నియమించారు. నూతన కమిటీ సభ్యులను సహచర పాత్రికేయులు అభినందించారు. జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని నాయకులు కోరారు. దశాబ్దాలుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల్లో చాలామందికి సొంత ఇల్లు లేకపోవడం ఆందోళనకరమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు లేదా గృహ నిర్మాణానికి అవసరమైన సహకారం అందేలా సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదని, వృత్తిపరమైన హక్కులు, ప్రభుత్వ సమాచార వ్యవస్థకు ప్రాప్యత, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాలతో ముడిపడి ఉన్న అంశమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా అక్రిడేషన్ లభించేలా నిబంధనలు అమలు చేయాలని, చిన్న పత్రికలు, స్థానిక మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వార్తా సేకరణలో భాగంగా జర్నలిస్టులు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు చోటుచేసుకున్నప్పుడు తక్షణమే స్పందించేలా భద్రత, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన జర్నలిస్టులకు న్యాయ సహాయం, పోలీసు రక్షణ, సంబంధిత అధికారులతో సమన్వయం వంటి అంశాల్లో యూనియన్ అండగా నిలవాలని నిర్ణయించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతోపాటు వృత్తి విలువలను కాపాడటం కూడా ముఖ్యమని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడం, వార్తల్లో వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వడం, వ్యక్తిగత ప్రయోజనాలకు దూరంగా ఉండటం, బాధితుల గోప్యతను గౌరవించడం, ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా ప్రచురించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం జర్నలిస్టుల విధులని తెలిపారు. ఒక్కో జర్నలిస్టు తన సమస్యను వ్యక్తిగతంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం కంటే, అందరూ ఒకే వేదికపైకి వచ్చి సమష్టిగా సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్, దాడులపై తక్షణ స్పందన, న్యాయ సహాయం, వృత్తిపరమైన శిక్షణ, ఆరోగ్య బీమా వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, పిల్లల విద్యకు సహాయం, వృద్ధాప్యంలో భరోసా, గృహ వసతి వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా సహకరించాలని సమావేశం కోరింది. పత్తికొండ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుని వారి సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు నూతన కమిటీ పనిచేస్తుందని నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత కాగా, జర్నలిస్టుల హక్కులను కాపాడటం యూనియన్ బాధ్యత అని సమావేశం అభిప్రాయపడింది. ఈ రెండు బాధ్యతలు సమన్వయంతో సాగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొంది.

# అల్లా బకాష్‌పై పీడీ యాక్ట్ నమోదు..

-పునరావృత నేరాలతో శాంతిభద్రతలకు విఘాతం..
-కడప సెంట్రల్ జైలుకు తరలింపు



**చిత్తూరు, ఆగస్టు 16(నేటి దర్శిని):**
చిత్తూరు జిల్లా పరిధిలో పలు నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న అల్లా బకాష్ అలియాస్ షేక్ బకాష్ (36)పై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. వైఎస్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌కు చెందిన అల్లా బకాష్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. అల్లా బకాష్ పలుమార్లు నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు ఎన్‌డీపీఎస్ కేసుల్లోనూ పట్టుబడ్డాడని ఎస్పీ తెలిపారు.పోలీసులు హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసం నేరాలకు పాల్పడుతూ ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా పరిణమించాడని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలతో యువతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అతనిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. సాధారణ చట్టపరమైన చర్యలతో అతని నేర కార్యకలాపాలను అరికట్టడం సాధ్యం కాకపోవడంతో పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్‌కు ఎస్పీ చేసిన సిఫారసు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా శాంతిభద్రతలను కాపాడటం, నేరపూరిత కార్యకలాపాలను అరికట్టడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యువత అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మోసాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై సాధారణ చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద నిర్బంధ చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎస్పీ సూచించారు. ప్రజలను ప్రలోభపెట్టడం, బెదిరించడం, గొడవలకు పాల్పడటం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# బాలల హక్కుల పరిరక్షణలో విశిష్ట సేవలకు అలర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రశంసా పత్రం



**అమలాపురం, ఆగస్టు 16(నేటి దర్శిని):**
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా నిరోధం తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న అలర్ట్ స్వచ్ఛంద సంస్థ సేవలను గుర్తించిన జిల్లా యంత్రాంగం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రంతో సత్కరించింది. ఆగస్టు 15న అమలాపురంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రావిరాల, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా, ఐ. మరియు ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో అలర్ట్ స్వచ్ఛంద సంస్థకు ప్రశంసా పత్రం అందజేశారు.
జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు అలర్ట్ సంస్థ వివిధ ప్రభుత్వ శాఖలు, పోలీసు శాఖ, డీసీపీయూ, ఐసీడీఎస్, కార్మిక శాఖ మరియు ఇతర భాగస్వామ్య సంస్థలతో సమన్వయంతో పనిచేస్తోంది. అలాగే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా నిరోధం, బాలల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోంది.ముఖ్యంగా జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదులు మరియు ఇతర ప్రార్థనా స్థలాల్లో బాల్య వివాహాలకు తావులేకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు మరియు చట్టపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. బాలల భద్రత, విద్య, హక్కులు మరియు వారి ఉజ్వల భవిష్యత్తు కోసం సంస్థ చేస్తున్న కృషిని జిల్లా యంత్రాంగం అభినందించింది. ఈ సందర్భంగా అలర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్. శ్రీనివాస్ మరియు జిల్లా కో-ఆర్డినేటర్ కె. వెంకటేశ్వరరావు సంస్థ తరఫున ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు.ప్రభుత్వపరంగా లభించిన ఈ గుర్తింపు అలర్ట్ స్వచ్ఛంద సంస్థకు మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని అందించిందని, భవిష్యత్తులో కూడా జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా నిర్మూలనతో పాటు బాలల హక్కుల పరిరక్షణ కోసం మరింత విస్తృతంగా పనిచేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# బోనాల జాతరతో పులకించిన పెద్దవంగర

## అమ్మవారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**పెద్దవంగర ఆగస్టు 16(నేటి దర్శిని):**
మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. మంగళహారతులు, అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. బోనాల వేడుకల సందర్భంగా మండల కేంద్రంలో పండుగ శోభ నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.



